సాక్షి
రాజన్న సిరిసిల్ల

శుక్రవారం । 16 । జూన్ । 2023



హాస్టల్ భవనాల పరిశీలన

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలోని కేజీ టు పీజీ విద్యార్థుల విన్నపం మేరకు స్థానిక ప్రభుత్వ వసతిగృహాలను గురువారం అధికారులు పరిశీలించారు.



ఆలయ ఉద్యోగులకు సన్మానం

వేములవాడ: దశాబ్ది ఉత్సవాల్లో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేత రాజన్న ఆలయ జట్టు సభ్యులను ఎమ్మెల్యే రమేశ్‌బాబు సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
41.0/30.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

ప్రజల రక్షణకే పోలీస్ శాఖ



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

వేములవాడరూరల్: ప్రజల కోసమే పోలీస్‌శాఖ నిరంతరం పనిచేస్తుందని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. వేములవాడరూరల్ మండలం తుర్కాషినగర్‌లో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాంను గురువారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి అనుమతులు లేని 30 బైక్‌లను, 5 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రధాన కూడలి వద్ద గ్రామస్తులతో మాట్లాడారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్‌క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు తెలపాలని కోరారు. వేములవాడరూరల్ సీఐ బన్సీలాల్, ఎస్సైలు మహేందర్, రమాకాంత్, ప్రభాకర్, సిబ్బంది ఉన్నారు.

సిరిసిల్లలో శానిటేషన్ డ్రైవ్



పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ కళ, కమిషనర్ సమ్మయ్య

సిరిసిల్లటౌన్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సిరిసిల్లలో శానిటేషన్ పనులపై గురువారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. పారిశుధ్య పనులను చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ సమ్మయ్య పరిశీలించారు. బహిరంగ ప్రదేశాలు, మురికి కాలువల్లో చెత్తపడేయరాదని సూచించారు. చెత్తను పడేస్తున్న వారిని గుర్తించి రూ.వేయి చొప్పున జరిమానా విధించారు.

వృద్ధుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టరేట్ ఏవో గంగయ్యకు వినతిపత్రం అందిస్తున్న వయోధికులు

సిరిసిల్లకల్చరల్/సిరిసిల్లటౌన్: వృద్ధులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆల్ సీనియర్ సిటిజెన్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ కోరుతోంది. సిరిసిల్లలోని వస్త్ర వ్యాపార సంఘ భవనంలో గురువారం వయోధికుల అవగాహన దినోత్సవం నిర్వహించారు. అనంతరం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ పరిపాలనాధికారి గంగయ్యకు, ఎస్పీ, ఆర్డీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చేపూరి బుచ్చయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య మాట్లాడుతూ వయోధికుల సమస్యల పరిష్కారానికి అన్ని పోలీస్‌స్టేషన్లలో వాలంటరీ కమిటీలు నియమించాలని, ఇంటిగ్రేటెడ్ డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు దొంత దేవదాస్, ఏనుగుల ఎల్లయ్య, శ్రీగాధ మైసయ్య, కోడం నారాయణ, గుడ్ల శ్రీధర్, గజ్జిల్లి రాంచంద్రం, అంకారపు జ్ఞానోభ, తిప్పర్తి రమేశ్, మిట్టపల్లి రాములు, నక్క మనోహర్, గోశికొండ మురారి, తడుక శ్రీహరి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ అడ్మిషన్లు రద్దు చేయాలి



బీసీడీవో ఆఫీసులో వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సిరిసిల్లటౌన్: బీసీ హాస్టల్స్‌లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియ నిర్ణయాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ కోరారు. ఈమేరకు గురువారం సిరిసిల్ల జిల్లా బీసీడీవో ఆఫీసులో వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. బీసీ విద్యార్థులు హాస్టళ్లలో సీటు కోసం ఆన్‌లైన్ దరఖాస్తు తర్వాత మూడు చొప్పున ఆప్షన్లను ఇవ్వాలని నిబంధన విధించడం సరికాదన్నారు. ఎక్కడ సీటు వస్తే అక్కడ చేరాలన్న నిబంధనల ద్వారా గ్రామీణ విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. హాస్టళ్లలో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆదిత్య,వేణు, సాయిబాబు, రాకేశ్ పాల్గొన్నారు.

ప్రమాదాల రహదారి



రగుడు-వెంకటాపూర్ బైపాస్ రోడ్డుపై చంద్రంపేట వద్ద కోనరావుపేట క్రాస్ రోడ్డు



చంద్రంపేట వద్ద ప్రమాదకరంగా బైపాస్ రోడ్డు



చంద్రంపేట వద్ద కోనరావుపేట క్రాస్ రోడ్డు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలో కొత్తగా నిర్మించిన బైపాస్‌రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రగుడు నుంచి వెంకటాపూర్ వెళ్లే రెండో బైపాస్‌రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుంది. నాలుగు రోడ్ల కూడలి కలెక్టరేట్ వద్ద అత్యంత డేంజర్ సర్కిల్ ఉంది. ఏ వాహనం ఎటు నుంచి వస్తుందో తెలియని దుస్థితి. ఇదే రోడ్డుపై చంద్రంపేట వద్ద కోనరావుపేట మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఉంది. ఈ క్రాస్‌రోడ్డు దారుణంగా ఉంది. ఇటీవల బైక్‌పై వెళ్తున్న వారిని ఓ కారువేగంగా ఢీకొట్టింది. రాజీవ్‌నగర్ వద్ద, చిన్నబోనాల, పెద్దబోనాల వద్ద క్రాస్‌రోడ్లు ప్రమాదకరంగా మారాయి. నిజానికి రెండో బైపాస్‌రోడ్డు ఇంకా పూర్తికాకున్నా వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ముందుగా ఆర్‌అండ్‌బీ అధికారులు ఆ రోడ్డు కాంట్రాక్టర్‌తో క్రాస్‌రోడ్ల వద్ద తక్షణమే రక్షణ ఏర్పాట్లు చేయిస్తే ప్రమాదాలను నివారించే అవకాశం ఉంది.

శిక్షణ కేంద్రం..ఉపాధి మంత్రం

- ఆదర్శంగా నిలుస్తున్న రాజన్నపేట మహిళలు
- మంత్రి దత్తత గ్రామంలో కుట్లు, అల్లికలతో ఉపాధి
- 100 కుట్టు మిషన్లు పంపిణీ
- ఆత్మగౌరవంతో ముందుకెళ్తున్న మహిళలు
- ఐదు నెలల్లో 350 మందికి శిక్షణ
- బ్యాంక్ రుణాలు అందిస్తూ.. అండగా నిలుస్తున్న నాబార్డ్
- వ్యాపారులుగా నిలదొక్కుకుంటున్న మహిళలు



అల్లికలపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటకు చెందిన గవ్వలపల్లి శిరీష. మహిళా సంఘం సభ్యురాలు. స్థానిక సీసీలు, వీవోల సూచనలతో అల్లికలు, ఫ్యాషన్ డిజైనింగ్‌పై శిక్షణ పొందింది. అప్పటి వరకు ఉపాధిహామీ పనులకు వెళ్లిన శిరీష శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత స్వయం ఉపాధితో ముందుకుళ్తోంది. తాను తయారుచేసిన వస్తువులను విక్రయిస్తూ..కుటుంబ పోషణకు బాసటగా నిలుస్తోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ రాజన్నపేటకు చెందిన న్యాలవెళ్లి స్రవంతి. వ్యవసాయ పనులు చేస్తూ కాలం గడుపుతున్న క్రమంలో నాబార్డ్ అధికారులు గ్రామానికొచ్చి అల్లికలు, కుట్లు, ఫ్యాషన్‌డిజైనింగ్‌పై ముందుగా అవగాహన కల్పించారు. 20 రోజుల్లోనే శిక్షణ పూర్తి చేసుకుంది. స్రవంతి తయారు చేసిన వస్తువులను నాబార్డ్ అధికారుల సహకారంతో మార్కెటింగ్ చేస్తూ ఉపాధి పొందుతోంది.

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పల్లె మహిళలు ఆత్మగౌరవంతో తలెత్తుకు జీవిస్తున్నారు. స్వయం ఉపాధితో కుటుంబాలను నిలబెడుతున్నారు. కుట్లు, అల్లికలతో తమ జీవితాలను అందంగా అల్లుకుంటున్నారు. నాబార్డ్ ఆధ్వర్యంలో ఆరు నెలల్లో 350 మంది మహిళలు మైక్రో ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎంఈడీపీ) కింద కుట్లు, అల్లికలలో శిక్షణనిచ్చారు. వీరంతా రుణాలు పొంది వ్యాపారవేత్తలుగా మారుతున్నారు. గ్రామైక్య సంఘాల పీపీలు, సీఏలు గ్రూపులోని మహిళలకు శిక్షణపై అవగాహన కల్పించి ఆసక్తి ఉన్న వారికి శిక్షణనిచ్చారు. శిక్షణ పూర్తి చేసిన వారు స్వయం ఉపాధితో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు.

జిల్లాలో శిక్షణ పొందిన 350 మంది

జిల్లాలో ఆరు నెలల్లో 350 మంది స్వయం సహాయక సంఘాల మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. తంగళ్లపల్లిలో 120, ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో 140, సిరిసిల్ల మండలం ముష్టిపల్లిలో 30, సిరిసిల్లరూరల్ మండలం పెద్దూర్‌లో 60 మంది శిక్షణ పూర్తి చేసుకొని ఆర్థిక సాధికారిత వైపు అడుగులు వేస్తున్నారు. శిక్షణ అనంతరం జూట్‌బ్యాగులు, మగ్గంవర్క్, ఫ్యాషన్ డిజైనింగ్, అల్లికలు, ఎగ్జిబిషన్‌కు వినియోగించే ప్రత్యేకమైన వస్తువులను తయారు చేస్తున్నారు. వీరికి నాబార్డ్ అధికారులే బ్యాంకుల ద్వారా రుణాలు అందించి, స్వయంగా వ్యాపారాలు పెట్టుకునేలా ప్రోత్సహిస్తున్నారు. మహానగరాల్లో నిర్వహించే ఎగ్జిబిషన్‌లో వీరు తయారు చేసిన ఫ్యాషన్ డిజైనింగ్ వస్తువులను విక్రయించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు.

మంత్రి ప్రోత్సాహం ఇలా..

మంత్రి కేటీఆర్ రాజన్నపేటను దత్తత తీసుకొని అభివృద్ధిలో ఆ గ్రామ రూపురేఖలు మార్చారు. గ్రామ మహిళలను స్వయం ఉపాధి వైపు నడిపించాలనే లక్ష్యంతో నాబార్డ్ అధికారులతో మాట్లాడి కుట్లు, అల్లికలు, ఫ్యాషన్ డిజైనింగ్‌పై శిక్షణ ఇవ్వాలని సూచించారు. అంతేకాకుండా శిక్షణ పూర్తి చేసుకున్న వారికి 100 కుట్టు మిషన్లు అందించారు. ఈ అవకాశాలను వినియోగించుకొని మహిళలు స్వయం ఉపాధితో ముందుకుసాగాలని మంత్రి ఆకాంక్షించారు. అందరి సహకారంతో జిల్లా మహిళలు నేడు ఆర్థిక స్వావలంబనతో అందరికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి



నాబార్డ్ అధికారుల సహాయంతో కుట్లు, అల్లికలపై శిక్షణ పొందాం. మాకు ఉపాధి దొరకడంతోపాటు బయట ప్రపంచంతో సంబంధాలు ఏర్పడుతున్నాయి. అనేక రంగాల్లోని వ్యక్తులతో పరిచయాలు ఏర్పడి ఉపాధి అవకాశాలు మెరుగవుతున్నాయి.

– చెట్టిపల్లి రేఖ, రాజన్నపేట

మంత్రి సహకారంతో..



మంత్రి కేటీఆర్ సహకారంతో కుట్లు, అల్లికలపై శిక్షణ పూర్తి చేసుకున్నాం. శిక్షణ కాలంలో ప్రతీ రోజు ప్రోత్సాహకంగా వేతనం అందించారు. శిక్షణ పొందిన వారికి కుట్టుమిషన్లు మంత్రి అందజేశారు. మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించిన వారికి రుణపడి ఉంటాం.

– మారోజు శ్వేత, రాజన్నపేట

స్వచ్ఛందంగా ముందుకొచ్చారు



కుట్లు, అల్లికలు నేర్చుకునేందుకు మహిళలు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. జిల్లాలో ఎక్కువ మంది ఇక్కడ నుంచి శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఉన్నారు. ఫ్యాషన్ డిజైనింగ్‌లో రాణిస్తూ ఉపాధి పొందుతున్నారు.

– ముక్క శంకర్, సర్పంచ్, రాజన్నపేట

ఆర్థికంగా అభివృద్ధి చేయడానికే..



మహిళలు ఆర్థికంగా ఎదిగి అభివృద్ధి చెందేలా ప్రో త్సహించడానికే కుట్ల శిక్షణ ఇచ్చాం. భవిష్యత్‌లో శిక్షణ పొందిన మహిళలకు బ్యాంక్ రుణాలు అందించి, వారికి ఇష్టమైన రంగంలో దుకాణాలు పెట్టిస్తాం. మహిళలు తయారు చేసిన వస్తువులను నగరాల్లో జరిగే ఎగ్జిబిషన్‌లలో విక్రయించుకునేలా ప్రోత్సహిస్తాం .శిక్షణ కార్యక్రమం నిరంతరం కొనసాగుతుంది.

– పి.మనోహర్‌రెడ్డి, నాబార్డ్, ఏజీఎం

మన 'పల్లె ప్రగతి' దేశానికి ఆదర్శం

- జాతీయ స్థాయిలో అవార్డులు
- జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ



జెండా వందనం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, నాయకులు

సిరిసిల్ల: తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న 'పల్లె ప్రగతి' దేశానికి ఆదర్శమని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ పేర్కొన్నారు. సిరిసిల్ల జెడ్పీ ఆఫీస్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జాతీయజెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టం–2018 ద్వారా పంచాయతీల బాధ్యతలు, నిధులు, విధులు, పారిశుధ్యం, పచ్చదనం, తడి, పొడి చెత్త సేకరణ వంటి ఆదర్శ విధానాలతో పల్లెల రూపురేఖలు మారిపోయాయన్నారు. రోడ్లకు ఇరువైపులా చెట్లతో పల్లెలు కళకళాడుతున్నాయన్నారు. జాతీయస్థాయిలో జిల్లా పల్లెలు అవార్డులు సాధించాయని గుర్తు చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లోనూ జిల్లాలోని పల్లెలు అవార్డులు పొందాయని అరుణ గుర్తు చేశారు. పల్లెప్రగతి ప్రణాళికలో భాగంగా డంపుయార్డులు, వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, క్రీడాప్రాంగణాలు, రైతువేదికలు, ట్రాక్టర్లు, ట్యాంకర్లు, మల్టీ పర్పస్ వర్కర్లు ఇలా అనేక విధాలుగా పల్లెలు ఆదర్శంగా నిలిచాయన్నారు. జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు, జెడ్పీటీసీ గుగులోతు కళావతి, కొమిరిశెట్టి విజయ, గుండం నర్సయ్య, జెడ్పీ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల్లో జెడ్పీ చైర్‌పర్సన్



సిరిసిల్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో పల్లెప్రగతి దినోత్సవం నిర్వహించారు. రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జెడ్పీ చైర్‌పర్సన్‌లు న్యాలకొండ అరుణ, దావ వసంత హాజరయ్యారు. సీఎస్ శాంతికుమారిని కలిసి మొక్కను అందజేశారు.

అందని సాయం

- 45 రోజులు గడుస్తున్నా చేతికందని పంట పరిహారం
- రెండో దఫాలో తీవ్రంగా నష్టపోయిన అన్నదాతలు
- ఉమ్మడి జిల్లాలో 97,311 మందికి తీవ్ర నష్టం
- మొత్తం 1.45 లక్షల ఎకరాల్లో పంటలు ధ్వంసం

ఉమ్మడి జిల్లాలో పంటనష్టం.. రైతుల వివరాలు

జిల్లా	పంటనష్టం (ఎకరాల్లో)	బాధిత రైతులు
కరీంనగర్	56,066	40,417
జగిత్యాల	59,794	32,444
పెద్దపల్లి	21,948	17,560
సిరిసిల్ల	8,175	6,890
మొత్తం	1,45,983	97,311



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఈ ఏడాది యాసంగి పంట సమయంలో కురిసిన అకాల వర్షాలతో కలిగిన నష్టానికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారం రైతులకు నేటికీ అందలేదు. మార్చిలో ఒకసారి, మే మొదటివారంలో మరోసారి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వరుణుడు విరుచుకుపడ్డాడు. ఈ క్రమంలో మొదటి విడతలో నష్టపోయిన పంటలను స్వయంగా సీఎం కేసీఆర్ కరీంనగర్‌లో పరిశీలించారు. రైతులను ఆదుకుంటామని, ఇందుకు ఎకరాకు రూ.10వేల చొప్పున అందిస్తామని ప్రకటించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా రూ.154 కోట్ల మేర పరిహారాన్ని ఇటీవల విడుదల చేశారు. పరిహారం జిల్లా వ్యవసాయాధికారుల ద్వారా ఇప్పటికే రైతుల ఖాతాల్లో పడింది. అయితే.. మొదటి విడత కన్నా రెండో విడతలోనే పంటలు అధికంగా నష్టపోయాయి. ఆ పరిహారమే రైతులకు అధికంగా రావాల్సి ఉంది. వానాకాలం పంటలు మొదలు పెట్టాలన్న అధికారుల సూచనల మేరకు చాలా మంది రైతులు ఇప్పటికే సాగు పనులు ప్రారంభించారు. మరోవైపు జరిగిన నష్టానికి పరిహారం ఇంకా అందక రైతులంతా ఎదురుచూస్తున్నారు.

వానాకాలం మొదలైనా..

ఈ ఏడాది అకాల వర్షాలతో రైతులు గతంలో ఎన్నడూ చూడని నష్టాన్ని చవిచూశారు. వరి, మామిడి, మొక్కజొన్న, పుచ్చ, ఇతర వాణిజ్య పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది. వాణిజ్య, కూరగాయల రైతులు పంటను కనీసం కోసుకోలేని దుస్థితి నెలకొంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో వరిని విస్తారంగా పండిస్తారు. రాష్ట్రంలోనే అధిక వరి ఉత్పత్తి కేంద్రంగా పేరొందిన పాత కరీంనగర్ జిల్లాలో ఈసారి వడగండ్లు, అకాల వర్షాలకు నష్టాలు కూడా అదే స్థాయిలో కనిపించాయి. సరిగ్గా పంట కోతకు వచ్చే సమయంలో వడగండ్లు, అకాలవర్షాలు, ఈదురుగాలుల కారణంగా గొలుసు దెబ్బతింది. ఫలితంగా గతేడాది కన్నా దిగుబడి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల జిల్లాల్లో పంట నష్టం, రైతుల వివరాలను సేకరించింది. సాయం అందుతుందని నెలరోజులుగా ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగులుతోంది. మొదటి దఫా నష్టపరిహారం కొందరికి అందినా.. తీవ్రనష్టాన్ని మిగిల్చిన రెండో దఫా పరిహారం ఇంకా అందకపోవడం వారిని తీవ్ర వేదనకు గురిచేస్తోంది.

అధికంగా జగిత్యాలలోనే..

పాత జిల్లాలో మొత్తంగా 1,45,983 ఎకరాల విస్తీర్ణంలో వరితోపాటు పలు రకాల వాణిజ్య పంటలు, కాయగూరల పంటలకు నష్టం వాటిల్లింది. జగిత్యాలలో అత్యధికంగా 59వేల ఎకరాల్లో 32 వేలకు పైగా రైతులు నష్టపోయారు. రైతుల సంఖ్యాపరంగా చూస్తే కరీంనగర్‌లోనే అధికంగా 40వేల మందికి పైగా నష్టపోయారు. అత్యల్పంగా సిరిసిల్లలో కేవలం ఎనిమిది వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది. అయితే నెలన్నర గడుస్తున్నా నేటికీ ఖాతాల్లో డబ్బులు పడకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది.

పరిహారం రాలే



భారీ వర్షాలు, ఈదురు గాలులకు మూడు ఎకరాల్లో మామిడి పంట దెబ్బతింది. కాయ మొత్తం నేల రాలింది. ఇప్పటివరకు రూపాయి పరిహారం రాలేదు. ఈసారి పంటకు పెట్టిన పెట్టుబడి కూడా వచ్చేలా కనిపించడం లేదు. దిగుబడి తగ్గి చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– ఎడమల మహిపాల్‌రెడ్డి, రేచపల్లి, జగిత్యాల

సాయం అందలే



నాలుగున్నర ఎకరాల్లో వరి సాగు చేయగా..ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షానికి పంట మొత్తం ధ్వంసమైంది. మంత్రి కేటీఆర్ కూడా మా వరి పంట నష్టాన్ని స్వయంగా పరిశీలించారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కూడా కల్పించారు. కానీ ఇప్పటివరకు ఆర్థిక సాయం అందలేదు.

– గంగదారి కుమార్, వీర్నపల్లి, రాజన్నసిరిసిల్ల

చిల్లిగవ్వ ఇయ్యలే..



అకాల వర్షాలకు రెండు ఎకరాల పోలం, ఒక ఎకరం మొక్కజొన్న వర్షాలకు పూర్తిగా నేల పాలైంది. సీఎం కేసీఆర్ ఎకరానికి రూ.10 వేలు ఇస్తానని ప్రకటించినా చేతికి చిల్లిగవ్వరాలేదు. మాలాంటి చిన్నకారు రైతులకు వెంటనే పరిహారం అందజేస్తే.. కాస్త ఉపశమనంగా ఉంటుంది.

– బోగి సంతోష్,నంసానిపల్లి, పెద్దపల్లి

మంత్రి చూసినా లాభం లేదు



యాసంగిలో ఆరు ఎకరాలు కౌలు, సొంతం రెండు ఎకరాల్లో వరిపంట వేశాను. రెండు రోజుల్లో కోద్దామనుకుంటే వడగళ్ల వానకు పంటంతా పోయింది. వ్యవసాయాధికారులు సర్వే చేశారు. మంత్రి గంగుల కమలాకర్ వచ్చి నష్టపరిహారం ఇప్పిస్తామని చెప్పినప్పటికీ ఇంత వరకు డబ్బులు రాలేదు.

– తోట శ్రీనివాస్, కౌలు రైతు, తాహెర్‌కొండాపూర్, కరీంనగర్

క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



కనగర్తిలో మాట్లాడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

కోనరావుపేట(వేములవాడ): గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీఎస్పీ నాగేంద్రచారి కోరారు. కనగర్తిలో గురువారం నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ మొక్కలు నాటితేనే పర్యావరణం బాగుపడుతుందన్నారు.

దేశాయిపల్లిలో డీఎస్పీ విచారణ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని దేశాయిపల్లిలో వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలో నివసించే సింధు అనే వివాహిత ఇటీవల ఆత్మహత్య చేసుకోగా వరకట్న వేధింపులతో ఆత్మహత్య చేసుకుందని తండ్రి అంజయ్య పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో డీఎస్పీ గ్రామంలో విచారణ చేపట్టి, వివరాలు నమోదు చేసుకున్నారు. ఏఎస్సై బాబు తదితరులు ఉన్నారు.

అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలి

సిరిసిల్లటౌన్: అర్హులకు కొత్త రేషన్‌కార్డులు అందివ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. దశాబ్దకాలంగా రేషన్‌కార్డులు రాక, పేర్ల నమోదు, తొలగింపులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్ది ఉత్సవాలపై ఉన్న పట్టింపు రాష్ట్ర పేదల సమస్యలపై కేసీఆర్ సర్కారుకు లేకపోవడం శోచనీయమన్నారు. జూన్ 1 నుంచి కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, ఎలగేలి రాజశేఖర్, సందుపట్ల పోచమల్లు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

కోరుట్ల: పట్టణంలోని భీమునిదుబ్బ శ్రీ లక్ష్మీ నరసింహ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం హుండీ పగులగొట్టి సుమారు రూ. 30వేల నగదు, వెండి ప్రతిమలు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

అభివృద్ధిలో ఆదర్శం మూడపల్లి

- పల్లెప్రగతిలో కలెక్టర్ అనురాగ్ జయంతి
- గ్రామంలో పనులు పరిశీలన

చందుర్తి(వేములవాడ): మండలంలోని మూడపల్లి గ్రామం అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని కలెక్టర్ అనురాగ్ జయంతి అభినందించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మూడపల్లిలో నిర్వహించిన పల్లెప్రగతిలో కలెక్టర్ పాల్గొన్నారు. గ్రామంలోని అభివృద్ధి పనులను చూసి సర్పంచ్ చిలుక అంజిబాబును అభినందించారు. సర్పంచ్‌గా ఎన్నికైనప్పటి నుంచి గ్రామంలో చేపట్టిన పనుల ఫొటో ఎగ్జిబిషన్‌ను పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేయగా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు, పంచాయతీ సిబ్బంది కలిసికట్టుగా పనిచేయడంతోనే గ్రామంలో పచ్చదనం, పారిశుధ్యం పనులు చక్కగా ఉన్నాయన్నారు. రైతువేదిక ఆకర్షణీయంగా ఉందని, గ్రామపంచాయతీ భవనం, వాటిని ఎదుట ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పూలమొక్కలు, నీడనిచ్చే చెట్లతో ప్రశాంతంగా ఉందన్నారు. అనంతరం గ్రామంలోని గర్భిణుల ఇళ్లకు వెళ్లి వారి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. ప్రసవానికి ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలని సూచించారు. జిల్లా పంచా యతీ అధికారి రవీందర్, అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, ఎంపీడీవో రవీందర్, ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఎంపీడీవో జూనియర్ అసిస్టెంట్లు రమాదేవి, ఐకేపీ ఏపీఎం రజిత, ఆశవర్కర్ స్రవంతి ఉన్నారు.



మూడపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. చందుర్తి పీహెచ్‌సీని పరిశీలించిన అనంతరం ఎన్‌ఎంలతో సమీక్షించారు. ప్రసవాలన్నీ ప్రభుత్వాస్పత్రిలో జరిగేలా చూడాలని కోరారు. గ్రామాల్లో నుంచి గర్భిణులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారని, వారందరిని ప్రభుత్వాస్పత్రిలోనే వైద్యపరీక్షలు చేయించుకునేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందని గుర్తు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వాసుపత్రుల్లో అన్ని రకాల సౌకర్యాలను కల్పించిందని వివరించారు. చందుర్తి పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా భవనం నిర్మించే స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీపీ బైరగోని లావణ్యకు, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాస్‌రావులకు సూచించారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

వేములవాడరూరల్: ఆస్పత్రిలో చేపట్టిన పనులను వెంటనే పూర్తిచేసి ఈనెల 22న ప్రారంభించుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం సందర్శించారు. ఆసుపత్రి ఆవరణలోని గదులను పరిశీలించిన ఆయన మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా వైద్యాధికారికి, ప్రజాప్రతినిధులకు సూచించారు. నాణ్యతతో వేగంగా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు, జిల్లా పంచాయతీరాజ్ అధికారులు, తహసీల్దార్ నక్క శ్రీనివాస్, ఎంపీడీవో రాంరెడ్డి, ఆస్పత్రి వైద్యాధికారి దివ్యశ్రీ, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

వైద్యం అందక బాలింత మృతి

- ప్రభుత్వాస్పత్రిలో డెలివరీ
- వైద్యసేవలపై అసంతృప్తి
- ప్రైవేట్ ఆస్పత్రిలో వికటించిన వైద్యం
- కరీంనగర్‌కు తరలిస్తుండగా మృతి

కోనరావుపేట(వేములవాడ): ప్రసవం కోసం ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా డెలివరీ చేసిన వైద్యులు తర్వాత సరైన వైద్యమందించకపోవడంతో బాలింతను కరీంనగర్‌కు తరలిస్తుండగా మృతిచెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. కోనరావుపేట మండలం కొలనూర్‌కు చెందిన ఎర్ర సాయిచందన, అంజికలకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నిశివర్శిక(5), హిమాన్స్(18 నెలలు) పిల్లలు ఉన్నారు. మూడోసారి గర్భం దాల్చగా.. డెలివరీ కోసం ఈనెల 12న సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. ఆస్పత్రిలో డెలివరీ కాగా బాబు జన్మించాడు. రక్తం తక్కువగా ఉందని వైద్యులు మంగళవారం ప్లేట్‌లెట్స్, రక్తం ఎక్కించారు. ప్లేట్‌లెట్స్ పెరగకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు వైద్యసేవలపై అసంతృప్తి చెందిన కుటుంబసభ్యులు సిరిసిల్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ప్లేట్‌లెట్స్ ఎక్కించగా ప్లేట్‌లెట్స్ పెరిగినప్పటికీ మూత్రవిసర్జన నిలిచిపోయింది. దీంతో ఆందోళన చెందిన ప్రైవేట్ వైద్యులు మూత్రపిండాల సమస్య ఉందని కరీంనగర్‌కు వెళ్లాలంటూ పంపించారు. కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో సాయిచందన ప్రాణాలు కోల్పోయింది. దీంతో ముగ్గురు చిన్నారులు తల్లిలేని వారయ్యారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సాయిచందన (ఫైల్)

కొయ్యకాళ్లకు నిప్పు.. చెలరేగిన మంటలు



పెద్దబడి వద్దకు చేరిన మంటలు



మంటలను అదుపులోకి తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది

- దగ్ధమైన గుడిసె
- గ్రామ శివారుకు చేరుకున్న మంటలు
- పొగతో విద్యార్థుల ఉక్కిరిబిక్కిరి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని భక్తి సంఘం శివారులో గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని వరికొయ్యకాళ్లు కాలిపోయాయి. ఈ సంఘటనలో సమీపంలో ఉన్న గుడిసె దగ్ధమైంది. ఎండకాలం కావడంతో మంటలు అదుపులోకి రాకపోగా.. సమీపంలోని పెద్దబడి వద్దకు చేరాయి. మంటలు పెద్ద ఎత్తున ఎగిసిపడడంతో పొగతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు విద్యార్థులను గదుల నుంచి బయటకు తీసుకొచ్చారు. మరోవైపు మంటలు పెద్దగా వ్యాపించడంతో అక్కడున్న రైతులు సిరిసిల్ల ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు సకాలంలో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. దీంతో సమీప ఇళ్లకు మంటలు వ్యాపించకుండా ప్రమాదం తప్పింది. ఎల్లారెడ్డిపేటకు చెందిన రైతులు బందారపు దేవేందర్‌రెడ్డి, భానుచందర్‌రెడ్డిలకు సంబంధించిన గుడిసె పూర్తిగా కాలిపోయింది. అందులో ఉన్న పైపులతోపాటు రూ.75వేల విలువ చేసే వస్తువులు కాలిబూడిదయ్యాయి. విషయం తెలుసుకున్న సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. సాయంత్రం వరకు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తేవడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

రాజీవ్‌గాంధీ క్విజ్ కాంపిటీషన్‌లో పాల్గొనండి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: రాజీవ్‌గాంధీ క్విజ్ కాంపిటీషన్ పోటీలో విద్యార్థులు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ కోరారు. వేములవాడలోని కళాశాలల్లోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. జూలై 2న రాజీవ్‌గాంధీ క్విజ్‌పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూలై ఒకటి వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి కొండల్‌రావు, సాగరం వెంకటస్వామి, చిలుక రమేశ్, కనికరపు రాకేశ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

'ప్రత్యేక' బడిబాట

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట భవిత సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నమోదు కోసం గురువారం బడిబాట నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి అర్హులైన విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అడ్మిషన్ల కోసం కోరారు. పద్దెనిమిదేళ్లలోపు వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను భవిత సెంటర్‌లో చేర్చుకోనున్నట్లు ప్రచారం చేశారు. డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో బన్నాజీ, భవిత సెంటర్ ఉపాధ్యాయురాలు రేణుక, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులతో డీఈవో

లెక్చరర్ దంపతులకు డాక్టరేట్లు



డాక్టరేట్లు సాధించిన ఆంజనేయులు-ప్రియాంక దంపతులు

సిరిసిల్లకల్చరల్: ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు లెక్చరర్లు డాక్టరేట్లు సాధించారు. సిరిసిల్లలోని శివనగర్‌కు చెందిన ఎలగొండ ఆంజనేయులు, ఆడెపు ప్రియాంకలకు మధ్యప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ, మెడికల్ సైన్సెస్ పరిశోధక డాక్టరేట్లను ప్రదానం చేశాయి. ఈ దంపతులిద్దరు డిగ్రీ కాలేజీ లెక్చరర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఆంజనేయులు గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో, ప్రియాంక ఆసిఫాబాద్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కాలేజీలో ఇంగ్లిష్ లెక్చరర్లుగా పనిచేస్తున్నారు. ప్రొఫెసర్ బబీనా బోస్రా మార్గదర్శకత్వంలో 'ఇన్వెస్టిగేషన్ ఆన్ ఏ మోడర్న్ కాంటెంపరరీ ఫిక్షన్ ఇన్ ఇండియా ఇంగ్లిష్ లిటరేచర్' అనే అంశంపై పరిశోధన చేశారు.

ప్రభుత్వాలు హామీలకే పరిమితం

- సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు

వేములవాడఅర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరలేదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు పేర్కొన్నారు. వేములవాడలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అందిస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. దేవరాజు, మల్లయ్య, రాజు, శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న కడారి రాములు

బైక్ అపహరిస్తూ పట్టుబడిన దొంగ

- అదుపులోకి తీసుకున్న పోలీసులు

వేములవాడ: వేములవాడలో ద్విచక్ర వాహనం అపహరిస్తుండగా దుండగుడిని పట్టుకుని విద్యుత్ స్తంభానికి కట్టేసిన సంఘటన గురువారం వేములవాడలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు. హైదరాబాద్‌కు చెందిన కిశోర్ స్నేహితుని తండ్రి మృతిచెందగా పరామర్శించేందుకు తన బైక్‌పై పార్వతీపురం వసతి గదుల వద్దకు చేరుకున్నాడు. బైక్‌ను నిలిపి పై అంతస్తులోకి వెళ్లాడు. అక్కడి నుంచి చూస్తుండగానే కిశోర్ అనే వ్యక్తి తన వాహనాన్ని తాళం తీసి తీసుకెళ్తుండడాన్ని చూసి వెంటనే పట్టుకొని విద్యుత్ స్తంభానికి బంధించాడు. అలాగే మహాశివరాత్రి జాతర సమయంలోనూ వాహనాన్ని దొంగిలించి కరీంనగర్ వద్ద వదిలి వెళ్లారని గుర్తించి స్థానికులు అనుమానితుని చితకబాదారు. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.



విద్యుత్ స్తంభానికి కట్టేసిన అనుమానితుడు శంకర్

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

చందుర్తి(వేములవాడ): అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకుని చందుర్తి పోలీసు స్టేషన్‌కు తరలించారు. చందుర్తి ఎస్సై జిల్లెల్ల రమేశ్ తెలిపిన వివరాలు. మండలంలోని మల్యాల గ్రామ శివారు నుంచి మట్టిని తరలిస్తుండగా బుధవారం అర్ధరాత్రి నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లను చందుర్తి తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై వివరించారు. అనుమతి లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నాగరాజు(ఫైల్)

ఇల్లంతకుంట(మానకొండూర్): మండలంలోని గాలిపల్లికి చెందిన పల్లె నాగరాజు(36) గురువారం ఇంటి ముందున్న చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య నీరజ తెలిపిన వివరాలు. నాగరాజు కొంతకాలంగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. అంతేకాకుండా ఇటీవల కరీంనగర్‌లో ఇల్లు కొనుగోలు చేయగా రూ.2లక్షల అప్పు అయిందనే మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఎస్సై రాజేశ్ పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కనగర్తిలో అట్రాసిటీ కేసుపై విచారణ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కనగర్తిలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై గురువారం విచారణ చేపట్టారు. కనగర్తికి చెందిన అండెం చంద్రారెడ్డి తనను కులంపేరుతో దూషించారని గ్రామానికి చెందిన లింగంపెల్లి లావణ్య కోనరావుపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. లావణ్య ఫిర్యాదుతో చంద్రారెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై డీఎస్పీ నాగేంద్రచారి గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఇరువర్గాలను, సాక్షులను ప్రశ్నించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఎస్సై రమాకాంత్, మాజీ సర్పంచ్ అనుపాటి బాపురెడ్డి ఉన్నారు.

ఇసుక లారీ పట్టివేత

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న ఇసుకలారీని గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపిన వివరాలు. రాచర్ల బొప్పాపూర్ శివారులో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు వాహనానికి ఎదురుగా వస్తున్న ఇసుకలారీని ఆపి పరిశీలించగా.. ఎలాంటి అనుమతి పత్రాలు లభించలేదు. దీంతో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న తాండూరు మండలం కాశిపేటకు చెందిన డ్రైవర్ మల్లేశ్‌తోపాటు లారీ యజమాని తాండూరు మండలం కొదురుపాకకు చెందిన శ్రీకాంత్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

సిరిసిల్లక్రైం: తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేట శివారులోని పోశమ్మ గుడి వద్ద గురువారం పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,840 నగదు, 6 మొబైళ్లను స్వాధీనం చేసుకున్నారు. సీసీఎస్ ఎస్సై మారుతి మాట్లాడుతూ సులభ సంపాదనకు అలవాటుపడి కొందరు చెడు వ్యసనాలకు, చట్ట వ్యతిరేకమైన చర్యలకు పాల్పడుతున్నారన్నారు. జిల్లాలో గ్యాంబ్లింగ్, బెట్టింగ్, పేకాట వంటి జూదాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గడ్డివాములు దగ్ధం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లి శివారులోని పంటపొలాల్లో గురువారం మంటలు వ్యాపించాయి. గడ్డివాములు, వ్యవసాయపొలాల్లోని పైపులు, కరెంటు సామగ్రి కాలి బూడిదయ్యాయి. వందల ఎకరాల్లో మంటలు వ్యాపించాయి. రైతులు ఎంత ఆపే ప్రయత్నం చేసినా ఆగలేదు. ఎవరో వరికొయ్యలకు నిప్పంటించడంతోనే మంటలు చెలరేగినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. రైతులు ఫైరింజన్‌కు సమాచారం అందించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు.

మాదిగలపై వివక్షచూపుతున్న మంత్రి కేటీఆర్

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మాదిగ బిడ్డలైన ప్రజాప్రతినిధులపై మంత్రి కేటీఆర్ వివక్షచూపుతున్నారని, ప్రొటోకాల్ పాటించకుండా అణచివేస్తున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ ఆరోపించారు. ఎల్లారెడ్డిపేటలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఎల్లారెడ్డిపేటలో బుధవారం నిర్వహించిన ఆలయ పునర్‌నిర్మాణం, అనంతరం జరిగిన సమావేశంలో స్థానిక ఎంపీటీసీ దళితబిడ్డ ఎలగందుల అనసూయను ప్రొటోకాల్ ప్రకారం వేదికపైకి ఆహ్వానించక అవమానానికి గురిచేశారన్నారు. శిలాఫలకంలోనూ స్థానిక ఎంపీటీసీ అనసూయ పేరు లేకపోవడం అన్యాయమన్నారు. ఇదే శిలాఫలకంలో మరో ఎంపీటీసీ పందిర్ల నాగరాణి పేరు ఉండడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలోనూ దళిత సర్పంచ్ తెడ్డు అమృతకు హరిదాస్‌నగర్‌లో ఇదే పరిస్థితి ఎదురైందని గుర్తు చేశారు. ఈ సంఘటనపై మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని కోరారు.



మాట్లాడుతున్న లక్ష్మణ్

'బీడీ కార్మికులకు చిప్స్ ప్యాకెట్లు ఎందుకిస్తున్నారు?'



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న రమేశ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తమ స్వార్థ ప్రయోజనాల కోసం బీడి కార్మికులకు చిప్స్ ప్యాకెట్లు అంటగట్టడం సరికాదని బీడి వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మూషం రమేశ్ ఆరోపించారు. తంగళ్లపల్లిలోని దేశాయి బీడీ కంపెనీని గురువారం సందర్శించి మాట్లాడారు. టేకేదారుల ద్వారా బీడి కార్మికులకు బలవంతంగా నెలకు రూ.300 విలువ చేసే చిప్స్ ప్యాకెట్లు ఇవ్వడం సరికాదన్నారు. వెంటనే చిప్స్ ప్యాకెట్ల అమ్మకాలను మానుకోవాలని కోరారు. కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, గోవిందు లక్ష్మణ్, సూరం పద్మ, కవిత, అన్నల్‌దాస్ గణేశ్, రాజశేఖర్, పోచమల్లు పాల్గొన్నారు.

దివ్యకు కొవ్వొత్తులతో నివాళి



కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన బ్యాంక్ ఉద్యోగిని న్యాలకంటి దివ్యను హత్యచేసిన నిందితునికి కోర్టు యావజ్జీవ శిక్ష విధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో గురువారం బీజేపీ, బీఎస్పీ నాయకులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మద్దుల బుగ్గారెడ్డి, రెడ్డి సంఘం మండలాధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి, అఖిలపక్షం నాయకులు రాజేశం గుప్తా, నవీన్, భాను, దివ్య తల్లిదండ్రులు లక్ష్మీరాజం, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



వర్షం కోసం పూజలు

గంభీరావుపేట(సిరిసిల్ల): యాసంగి వరికోతల సమయంలో ఈదురుగాలులు, అకాల వర్షాలు రావొద్దని గంభీరావుపేటలోని శ్రీసీతారామస్వామి ఆలయంలో రైతులు, భక్తులు ముడుపు కట్టారు. ప్రస్తుతం వరికోతలు పూర్తయి.. వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో రామాలయంలో కట్టిన ముడుపును గురువారం ప్రత్యేక పూజల అనంతరం రైతులు విప్పారు. వాహన సేవపై సీతారామస్వామిని ఊరేగించారు.